క్లుప్తంగా

25న లక్ష్మీజయంతి

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతా రామస్వామి ఆలయంలో ఈ నెల 25న లక్ష్మీజ యంతి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ వి. శ్రీనివాసరావు మంగళవారం విలేకర్లకు తెలిపారు. ఆ రోజు ఉదయం 8.30 నుంచి అమ్మవారి పంచామృ తాభిషేకాలు, కుంకుమ పూజ, 108 మంది మహిళలతో సామూహిక లక్ష్మీపూజ, 108 తామర పువ్వులతో పూజ, లక్ష్మీ హోమం, పూర్ణాహుతి వైభవంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కోడ్ అమలుపై పర్యవేక్షణ



వేళంగి చెక్‌పోస్ట్ వద్ద వాహనాన్ని సోదా చేస్తున్న అధికారులు

కరప: సాధారణ ఎన్నికల నేపథ్యంలో కోడ్ పర్యవేక్షక అధికారులు మండల పరిధిలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఎంపీడీఓ కె.అప్పారావు ఆధ్వర్యంలో పి.సత్యనారాయణ (ఎంఈఓ), మహ్మద్ షఫీన్, పి.సత్యనారా యణ (కానిస్టేబుల్) ఎంసీసీ టీమ్ కరప, వేళం గి, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి, పాతర్లగడ్డ, పెనుగుదురు తదితర గ్రామాల్లో పర్యటించి రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు, హోర్డింగులు, పార్టీ జెండాలను తొలగింపచేశారు. వేళంగి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను సోదా చేశారు. తగిన ఆధారాలు లేకుండా నగదు కానీ, వస్తు వులు కానీ, మద్యంకానీ రవాణా చేస్తే, వాహ నాలను సీజ్‌చేసి, బాధ్యులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

హోప్ ఫర్ చేంజ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

బోట్‌క్లబ్: హోప్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ, రెయిన్‌బో క్లబ్ ఆధ్వర్యంలో మంగళ వారం స్థానిక నూకాలమ్మ మాన్యం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సేవాసంస్థ వ్యవస్థాపకుడు లక్ష్మీనాగేంద్ర ప్రారంభించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉం డడంతో పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తు న్నట్లు చెప్పారు. రెయిన్‌క్లబ్ అధ్యక్షురాలు బాలాత్రిపుర సుందరి మాట్లాడుతూ ఈ ప్రాం తంలో విద్యార్థులు, పాదచారులు, ఆర్టీసీ ప్రయాణికులు అధికంగా ఉండడంతో మజ్జిగ పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

30న పాస్టర్ల శాంతి ర్యాలీ

కరప: గుడ్‌ఫ్రైడే ఈస్టర్ సందర్భంగా ఈ నెల 30న తలపెట్టిన శాంతియుత ర్యాలీ(రస్‌ఫర్‌జీ సస్) విజయవంతం చేయాలని మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.సత్య ప్రసాద్‌బాబు కోరారు. మండలం నడకు దురులోని న్యూ ఎరుషలేం ప్రార్థనామందిరం లో మంగళవారం జరిగిన మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లా డారు. నడకుదురు, పెనుగుదురు, కరప గ్రామాల్లో 30న ఉదయం 6.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నా. మండలంలోని అన్నిసం ఘాలు తమసంఘసభ్యులతో కల్సి పాల్గొ నాలని ప్రెసిడెంట్ సత్యప్రసాద్‌బాబు కోరారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ సెక్రటరీ డాక్టర్ పి.సామ్యూల్‌రాజు, ట్రెజరర్ డాక్టర్ ఆర్.ప్రతా ప్‌కుమార్, చైర్మన్ డక్టార్ స్టీఫెన్‌బాబు తదిత రులు పాల్గొన్నారు.

నేడు కేసీబీఎస్ సమావేశం

బోట్‌క్లబ్: ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం సాయంత్రం 4.30కు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సినిమా రోడ్డులోని సూర్య కళామందిరం ఆవరణలో ఉన్న కేవీఆర్‌కే రావు ఆడిటోరియంలో ఈ సమావేశం జరుగుతుంద న్నారు. సంస్థ సభ్యులంతా ఈ సమావేశానికి తప్పక రావాలని ఆయన సూచించారు.

గేట్-24 ఫలితాల్లో కౌశిక్‌కు 118వ ర్యాంకు



మీసాల సాయి దుర్గా కౌశిక్

బాలాజీచెరువు: గ్రాడ్యుయేట్ అప్టిట్యూట్ ఇంజినీరింగ్-24 పరీక్ష ఫలితాల్లో జేఎన్టీయూకే ఈసీఈ పూర్వ విద్యార్థి మీసాల సాయి దుర్గా కౌశిక్ ఒపెప్ కేట గిరిలో 118వ ర్యాంక్ సాధించాడు. ప్రస్తుతం కేంద్ర రంగ పరిశోధన సంస్థలో ఉద్యోగం చేస్తున్న సాయి కౌసిక్ ఉన్నత విద్య అభ్యసించి పరిశోధన రంగంలో అగ్రస్థానంలో నిలవ డమే తన లక్ష్యంగా పేర్కొన్నాడు. తండ్రి కాశీ విశ్వనాథ్ విశ్రాంత పోలీసు కాగా తల్లి పద్మావతి గృహిణి.

సిస్మిక్ సర్వేలపై సమాచారం ఇవ్వాలి

కాకినాడ సిటీ: ఓఎన్‌జీసీ సిస్మిక్ సర్వేలపై మత్స్యకారులకు సమాచారం ఇవ్వకపోవడం పై బోటు యజమానులతో కలసి టీడీపీ నాయ కుడు వనమాడి వెంకటేశ్వరరావు మంగళ వారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన చేపట్టారు. డీఆర్వో డి.తిప్పేనాయక్ వచ్చి ఓఎన్‌జీసీ ప్రతి నిధులు, మత్స్యకార వర్గాలు, బోటు ఓన ర్సుతో మరలా సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

వినియోగదారుల బ్రహ్మాస్త్రం 1967

- ఈ నంబర్‌తో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్
- పౌర సరఫరా, తూనికలు-కొలతలు శాఖల్లో మోసాలకు చెక్
- ఫిర్యాదు చేస్తే సత్వర పరిష్కారం



కాకినాడ సిటీ: గుండుసూది నుంచి గూగుల్ సేవల వరకు పాల నుంచి ఫార్మా కంపెనీల కల్తీ వరకు, రియల్ ఎస్టేట్ మోసాల నుంచి కార్పొరేట్, ఈ-కామర్స్ సంస్థల దోపిడీ వరకు ఎక్కడైనా సేవల్లో మోసం జరిగినా వస్తువుల్లో నాణ్యత లోపించినా వినియోగదారులు ఏమి చేయలేని పరిస్థితి. అలాంటి వారి చేతికి రాష్ట్ర ప్రభుత్వం బ్రహ్మాస్త్రం అందిస్తోంది. ఫిర్యాదులు, వినతులు, సలహాల కోసం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. 1967 నంబర్‌తో రాష్ట్ర పౌరసరఫరాల కార్యాలయంలో అందుబాటులో ఉంచింది. ఎవరికైనా వస్తు సేవలను పొందడంలో ఇబ్బంది ఉంటే నేరుగా ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే సత్వర పరిష్కారం లభిస్తుంది.

టోల్‌ఫ్రీ నంబర్లను అనుసంధానం చేస్తూ..

గతంలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయంలో ప్రజలు, వినియోగదారులు, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఎదుర్కొనే వారి సమస్యలను పరిష్కరించేందుకు వివిధ టోల్ ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉండేవి. ఇందులో పౌరసరఫరాల శాఖకు సంబంధించి ఫిర్యాదులను 18004253111/1967 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు, రాష్ట్ర ఆహార కమిషనర్‌కు ఫిర్యాదులు, సలహాలు, సూచనలు చేసుకునేందుకు 18004252388/155235 అనే టోల్‌ఫ్రీ నంబర్, తూనికలు, కొలతల శాఖకు సంబంధించి ఫిర్యాదుల కోసం 18004254205 అనే టోల్‌ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉండేవి. దీంతో ఫిర్యాదులు ఒకరి చేయడానికి బదులు మరో శాఖకు వెళ్లేవి. అంతేకాక వినియోగదారులు అన్ని నంబర్లకు గుర్తుంచుకోవడం కష్టంగా ఉండేది. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్ని టోల్‌ఫ్రీ నంబర్లను అనుసంధానం చేస్తూ 1967 అనే నంబర్‌తో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

ఎలాంటి ఫిర్యాదులు చేయవచ్చు?

ఈ కాల్ సెంటర్‌కు ప్రజలు వినియోగదారుల, వ్యవహారాల, ఆహార, పౌరసరఫరాల శాఖకు సంబంధించిన అన్ని రకాల ఫిర్యాదులను చేయవచ్చు. ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో తూకాలు, అధికంగా డబ్బులు తీసుకోవడం, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్, పెట్రోలు బంకులు, తూనికలుర-కొలతలు, బియ్యం కార్డు సేవలపై ఫిర్యాదులు చేయవచ్చు. అదే విధంగా సలహాలు, సూచనలు ఇవ్వవచ్చు. చేసిన ఫిర్యాదును సంబంధిత శాఖల పరిష్కారం నిమిత్తం పంపుతారు. అంతేకాక నిర్దేశించిన సమయం తరువాత ఫిర్యాదు ఏ దశలో ఉన్నదో, ఎవరి వద్ద పెండింగ్‌లో ఉన్నదో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా తెలుసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోండి



వినియోగదారుల రక్షణ చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను 1967 నంబర్‌తో ఏర్పాటు చేసింది. ఇది ఉదయం నుంచి సాయంత్రం 8 గంటలకు అందుబాటులో ఉంటుంది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. వస్తు సేవల్లో ఇబ్బందులు ఉంటే నేరుగా కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చు.

ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి,
జాయింట్ కలెక్టర్, కాకినాడ జిల్లా

పరిశ్రమల్లో భద్రతపై సదస్సు



పరిశ్రమల్లో భద్రతా విధానాలను వివరిస్తున్న శ్రీనివాసరావు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ డైరెక్టరేట్, పెట్రోలియం ఇంజినీర్ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. ప్రాసెస్ సేఫ్టీ ఎలిమెంట్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ ఇన్ ఆయిల్ గ్యాస్ ఇండస్ట్రీస్ అంశంపై వర్క్‌షాపు నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆరిక్స్ జిటిల్ సంస్థ ప్రతినిధి డాక్టర్ రేఖపల్లి శ్రీనివాసరావు హాజరై పరిశ్రమలకు అవసరమైన భద్రతాపరమైన అంశాలను వివరించారు. పరిశ్రమలో భద్రత, పాటించే విధానం, బిహేవియర్ సేఫ్టీ, ప్రాసెస్ కంట్రోల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అంశాలపై ఉదాహరణలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఓడీఎల్ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, కేవీ రావు,కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల సమరానికి సిద్ధం కండి

- పార్టీ శ్రేణులకు ద్వారంపూడి పిలుపు
- వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



ఎమ్మెల్యే ద్వారంపూడిని సత్కరిస్తున్న 6వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు

కాకినాడ: త్వరలో జరగనున్న ఎన్నికల సమరానికి పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం 6వ డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ద్వారంపూడిని కలిసారు. ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టే అంశంపై ఎమ్మెల్యేతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేసి విజయం దిశగా పయనించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. క్లస్టర్ ఇన్‌చార్జి మల్లిపాముల గణపతి, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పార్టీలో చేరికలు

స్థానిక 6వ డివిజన్‌కు చెందిన పేకేటి సారథి ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే ద్వారంపూడి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే 4వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కంపర బాబీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ద్వారంపూడిని కలిసారు. కాకినాడ సిటీ అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన నేపథ్యంలో డివిజన్ నాయకులు, వివిధ సంఘాల నాయకులు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడ రూరల్ పండూరు గ్రామం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు శీలి రాజు, బర్రే రమణ ఆధ్వర్యంలో తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సుమారు 30 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సీఎం జగన్ చేస్తున్న సంక్షేమం, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు చెప్పారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాలు, సంక్షేమ పథకాల అమలును ప్రతి లబ్ధిదారునికి తెలియజేసి వైఎస్సార్ సీపీ ఆవశ్యకతను తెలియజేయాలన్నారు.

రూ.వెయ్యికోట్లకు ఆధారం ఎక్కడ?

- ఆరోపణలు నిరూపిస్తే టీడీపీ కండువాలు కప్పకుంటాం
- మత్స్యకారజాతిని పేటీఎం బ్యాచ్ అనడం తగదు
- కొండబాబుపై మండిపడ్డ మత్స్యకారులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యకార ప్రతినిధులు

కాకినాడ: కేజీబేసిన్‌లో కార్యకలాపాలకు సంబంధించి ఓఎన్‌జీసీ రూ.వెయ్యి కోట్లు సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి బినామీ ఖాతాల్లో వేసిందంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చేసిన ఆరోపణలపై ఆధారాలు చూపించాలని పలువురు మత్స్యకార పెద్దలు డిమాండ్ చేశారు. అలా చూపితే తామంతా టీడీపీ కండువాలు కప్పుకుని వనమాడి వెంటనడుస్తామని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇంకా టిక్కెట్ ప్రకటించలేదన్న ఫ్రస్ట్రేషన్‌లో కొండబాబు నిరాధారమైన విమర్శలు చేస్తూ మత్స్యకార జాతి తలదించుకునేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. స్థానిక లంగరురేవు వద్ద మత్స్యకార ప్రతినిధులు వాసుపల్లి కృష్ణ, పాలెపు నూకరాజు, కాటాడి సత్యనారాయణ, బొక్కా వెంకటేశ్వర్లు, చెక్కా శ్రీను, ఓలేటి నూకరాజు తదితరులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మత్స్యకార జాతి ప్రతినిధిగా ఉన్న వనమాడి కొండబాబు ఓఎన్‌జీసీ పరిహారం ఇచ్చే విషయంలో ఏనాడూ సహకరించ లేదని విమర్శించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాత్రం తమకు అండగా నిలిచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో నిపుణుల కమిటీ వేయించి పరిహారం వచ్చే విషయంలో చిత్తశుద్ధితో సహకరిస్తున్నారన్నారు. దీనివల్ల వచ్చే ఎన్నికల్లో నష్టపోతానన్న భయంతో జాతిపరువు తీసేలా ఓఎన్‌జీసీ పరిహారం ఇప్పటికే ద్వారంపూడి బినామీ ఖాతాలకు చేరిందంటూ విమర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. పైగా కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తూ ఉద్యమంలో ఉన్న మత్స్యకారులను పేటీఎం బ్యాచ్ అంటూ వ్యాఖ్యలు చేసి జాతిపై ఉన్న అక్కసును వెళ్లగక్కారని విమర్శించారు. బురదచల్లి కడుక్కోమనే రీతిలో వ్యవహరించడం అతనికి తగదన్నారు. పార్టీలకు అతీతంగా జనసేనకు చెందిన ముత్తా శశిధర్ కూడా తనకు సంఘీభావం ప్రకటించారని, జాతికి చెందిన వ్యక్తి అయ్యివుండి కూడగా మద్దతు తెలపకుండా తిరిగి వెన్నుపోటు పొడుస్తున్నారంటూ మండిపడ్డారు. ఉన్న మర్యాదను పోగొట్టుకోవద్దని, చేతనైతే చేసిన ఆరోపణలకు స్పష్టమైన ఆధారాలు ఇవ్వాలని నిలదీశారు. 2014లో ఎమ్మెల్యేగా ఉన్న కొండబాబు మత్స్యకారులకు నష్టపరిహారం ఇప్పించే విషయంలో ఎందుకు స్పందించలేకపోయారని నిలదీశారు. ఇన్నాళ్లు నిద్రపోయావా అంటూ నిలదీశారు.

కోడ్ కచ్చితంగా పాటించాలి

- ఈఆర్వో వెంకటరావు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆర్‌వో వెంకటరావు



చెక్‌పోస్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: ఎన్నికల ప్రవర్తన నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు కచ్చితంగా పాటించి సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటరింగ్ అధికారి, కమిషనర్ జె.వెంకటరావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇప్పటి వరకు కొత్త ఓట్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించిన సమాచారాన్ని ఆయా పార్టీల ప్రతినిధులకు వివరించారు. అనంతరం ఆర్వో మాట్లాడుతూ కోడ్‌ను పటిష్టంగా అమలు చేయడంలో ఆయా పార్టీల తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. అలాగే ఎక్కడైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలంటే 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఎన్నికల ప్రచారానికి వలంటీర్లను వినియోగించరాదని స్పష్టం చేశారు. సమావేశంలో రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్ (టీడీపీ), అప్పారావు (బీఎస్‌పీ), డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహసీల్దార్ దొర, ఎలక్షన్ డీటీ సీతాపతిరావు, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల పరిశీలన

ఎన్నికల నేపథ్యంలో కాకినాడ సిటీ ముఖద్వారాల వద్ద ప్రతిపాదించిన చెక్‌పోస్టులను రిటర్నింగ్ అధికారి, కమిషనర్ వెంకటరావు మంగళవారం పరిశీలించారు. ప్రతాప్‌నగర్ వంతెన, యానాం రోడ్డు, కుంభాభిషేకం ప్రాంతాల్లో ప్రతిపాదించిన చెక్‌పోస్టు ప్రదేశాలను అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ కల్పించాల్సిన ఏర్పాట్లు, సౌకర్యాలపై అధికారులకు సూచనలిచ్చారు. ఎస్ఈ పి.సత్యకుమారి, ఈఈ మాధవి, డీఈలు లక్ష్మి, లోవరాజు, ఏఈలు వై.నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ రుణాలు

యూనియన్ బ్యాంకు ఆర్‌ఎం సాయి మనోహర్



రుణ మంజూరు పత్రాలు అందిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆర్‌ఎం సాయి మనోహర్

బోట్‌క్లబ్: అవసరమైన ప్రతి ఒక్కరికీ తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నామని యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సాయి మనోహర్ అన్నారు. స్థానిక తిలక్‌వీధిలోని యూనియన్ బ్యాంకులో మంగళవారం మెగా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ బ్యాంక్‌లో వ్యవసాయ, వ్యాపార, వ్యక్తిగత రుణాలు, వివిధ పథకాల ద్వారా అతి తక్కువ వడ్డీకి తక్కువ వ్యవధిలోనే ఇస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ డీవీ రంగారావు మాట్లాడుతూ ఖాతాదారులకు సేవలందించేందుకు తాము ఎప్పుడూ ముందుంటామన్నారు. అనంతరం రుణాలు మంజూరైన వారికి రుణ మంజూరు పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రామతత్వమే రాజమార్గం



అన్నదానం చిదంబర శాస్త్రిని సత్కరిస్తున్న వాత్సల్య భారతి సభ్యులు

బోట్‌క్లబ్: సమాజం ఎదుర్కొంటున్న సకల సమస్యల పరిష్కారానికి రామ తత్వాన్ని అవగాహన చేసుకోవడమే రాజమార్గమని ప్రముఖ సాహితీవేత్త అన్నదానం చిదంబర శాస్త్రి అన్నారు. భారతమాత తత్వ ప్రచార వేదిక, వాత్సల్య భారతి ఆధ్వర్యంలో విద్యుత్ నగర్‌లో ఒక ఫంక్షన్‌హాల్లో చిదంబర శాస్త్రిని మంగళవారం సత్కరించారు. అయోధ్య రామమందిర నిర్మాణంలో ముఖ్య భూమిక వహించగలగడం రామానుగ్రహమే అన్నారు. మానవుడిగా పుట్టి దైవత్వాన్ని నిరూపించిన రాముడిది పరిపూర్ణ అవతారమన్నారు. రాముడిని మనసులో ఊహించుకుంటే ఎన్నో మంచి లక్షణాలు అలవడతాయన్నారు. వాత్సల్య భారతి గౌరవ అధ్యక్షుడు ఎంవీ కుమార స్వామి దేశభక్తి, దైవభక్తి, మాతృభక్తిపై పాఠశాల కేంద్రంగా చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. వీహెచ్‌పీ జాతీయ న్యాయసలహా విభాగ సభ్యులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ మాట్లాడుతూ దశాబ్దాలుగా అయోధ్య రామమందిర నిర్మాణానికి హిందూ సమాజం చేసిన కృషిని వివరించారు. ప్రొఫెసర్ జీఎస్ మూర్తి, వాత్సల్యభారతి గౌరవాధ్యక్షులు కుమారస్వామి, ఉపాధ్యక్షులు మద్దాలి శ్రీనివాసరావు, కార్యదర్శి సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో అన్నదానం చిదంబర శాస్త్రిని సన్మానించారు.

అనుమతి లేకుండా జనసేన కార్యాలయం ఏర్పాటు

కరప: ఎన్నికల కోడ్ అమలులో ఉంది, అయినా ఎటువంటి అనుమతులు లేకుండానే మంగళవారం కరపలో జనసేన పార్టీ మండల కార్యాలయాన్ని ఆ పార్టీ కాకినాడ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ ప్రారంభించారు. ఏ పార్టీ అయినా ఎన్నికల కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలంటే నియోజకవర్గ ఆర్వోకు దరఖాస్తు చేసుకుంటే, అక్కడ నుంచి అనుమతి వచ్చిన తర్వాతనే ప్రారంభించాల్సి ఉంటుంది. జనసేన పార్టీ కార్యాలయం ఏర్పాటుకు దరఖాస్తు అయితే చేశారు కానీ, అనుమతి రాకుండానే హడావిడిగా ప్రారంభించడం విశేషం. దీనిపై ఎంసీసీ అధికారి, ఎంపీడీఓ కె.అప్పారావును వివరణ కోరగా జనసేనపార్టీ వారు దరఖాస్తు చేసినట్టు తెలిపారన్నారు. 24 గంటల్లో అనుమతులు చూపాలని, లేకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సదరు పార్టీకి నోటీసులు ఇచ్చామన్నారు.


విద్యార్థులకు దుస్తులు, పుస్తకాల పంపిణీ



వీరభద్రారెడ్డి దంపతులను అభినందిస్తున్న అభిమానులు

కాకినాడ క్రైం: బుధవారం రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి తన జన్మదినం సందర్భంగా మంగళవారం నగరంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వీరభద్రారెడ్డి తన సతీమణి మాధురితో కలిసి పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదంలో తన భర్తను కోల్పోయిన ప్రత్తిపాడుకు చెందిన ఓ మహిళ కుమారుడి విద్య కోసం సీఎస్సార్ నిధుల నుంచి కొంత మొత్తాన్ని అందజేశారు. అనంతరం జగన్నాథపురం బీసీ హాస్టల్‌లో 70 మందికి విద్యార్థులకు నూతన వస్త్రాలు, పుస్తకాలు, కలాలు, జామెట్రీ బాక్సులు అందజేశారు. వీరభద్రారెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల నిర్వహణకు శ్రీ యువసేన ఓ మంచి వేదిక అన్నారు. పేద ప్రజల కోసం పాటు పడుతున్న వ్యవస్థాపకుడు బొల్లం సతీష్‌ను అభినందించారు. కర్రి చినబాబు, రోకళ్ల సత్యనారాయణ, బసవ అశోక్, కొప్పిశెట్టి షణ్ముఖ్, గీసాల వీరబాబు, దీప, దుర్గ, అవ్యక్త, కుమార్‌తో పాటు శ్రీ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం



వలసపాకలలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల గ్రామంలో శ్రీరామచంద్రస్వామి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామంలో మెయిన్ రోడ్డును ఆనుకుని రామాలయం నిర్మించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం విశేష సుదర్శన హోమం నిర్వహించారు. మంగళవారం ఉదయం సీతమ్మ, రాములోరిని అలంకరించిన వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ కల్యాణం చేశారు. అనంతరం శ్రీపుష్ప యాగం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్వామి వారిని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ తదితరులు దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ



మృదంగ విద్వాంసుడు కమలాకరరావును సత్కరిస్తున్న సరస్వతీ గాన సభ సభ్యులు



గాత్ర కచేరీ చేస్తున్న రమ్య కిరణ్మయి

బోట్‌క్లబ్: సరస్వతి గాన సభ 120వ వార్షిక సంగీత నృత్య నాటకోత్సవాలలో భాగంగా మంగళవారం సూర్యకళా మందిరంలో చెన్నైకి చెందిన చాగంటి రమ్య కిరణ్మయి గాత్ర కచేరీ ఆహ్లాదంగా సాగింది. వరాళి రాగంలో మామవ మీనాక్షి, బిలహరి రాగంలో ఎవరిని వేడను, మైసూర్ వాసుదేవాచారి ధన్యాసి రాగంలో నీ చిత్తము మొదలైన కీర్తనలు చక్కగా ఆలపించి ప్రేక్షకులను అలరించారు. వీరికి వయోలిన్‌పై మంథా రమ్య, మృదంగంపై కె.సద్గురు చరణ్, చక్కటి సహకారాన్ని అందించారు. తొలుత మృదంగ విద్వాంసులు వి.కమలాకరరావుకు జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొమ్మిరెడ్డి రామనరసింగరావు, పెద్దాడ సూర్యకుమారి, కేవీఎస్ ఆంజనేయమూర్తి, పేపకాయల రామకృష్ణ, చెరుకువాడ సత్యనారాయణ, చావలి సూర్యకుమారి, గోపి పళ్లంరాజు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఎముకల దృఢత్వం

కాకినాడ రూరల్: శారీరక వ్యాయామం వలన ఎముకలు గట్టి పడతాయని పీఎంపీ వైద్యులు కుమార యాదవ్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చిన్నతనం నుంచి ఎముకలు బలంగా ఉంటే చివరి దశ వరకు ఆరోగ్యంగా ఉంటామన్నారు. 20 ఏళ్ల వరకు ఎముకల సాంద్రత పెరిగి 35 ఏళ్ల తర్వాత తగ్గుతుందన్నారు. ఎముకలు బలహీన పడితే చిన్నపాటి ప్రమాదాలకు కూడా విరుగుతాయన్నారు. పోషకాహార లోపం, దీర్ఘకాలిక మందుల వినియోగం ఎముకలపై ప్రభావం చూపుతాయని తెలిపారు. ఎముకల బలానికి తగినంత ఖనిజాలు, ప్రొటీన్లు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. వృద్ధాప్యంలో కూడా చిన్న చిన్న పనులు చేసుకోవడం వలన కదలికలతో ఆరోగ్యంగా జీవించవచ్చని కుమార్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్ పాల్గొన్నారు.